అసంపూర్తిగా డ్రెయినేజీ పనులు

- జనవాసాల్లో నిలుస్తున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవస్థలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో పాలకుర్తి రోడ్డు వైపు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నాడు. దాంతో పాలకుర్తి రోడ్డుకు నివాసం ఉన్న ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లిలో పాలకుర్తి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేలా ఆర్అండ్‌బీ వారు రూ.40లక్షల నిధులతో మూడు నెలల క్రితం సైడ్ కాల్వల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇరువైపులా పనులను తూతూ మంత్రంగా సగం వరకే చేసి వదిలేశారు. రైల్వేస్టేషన్ నుంచి వ్యవసాయ మార్కెట్ సమీపాన ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వరకు సైడ్ డ్రైనేజీల నిర్మాణాలు చేయాల్సి ఉండగా సగం వరకే చేపట్టారు. దాంతో డ్రైనేజీ నీరు జనవాసాల మధ్య నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. దాంతో ఆ ప్రాంత ప్రజలు దుర్వాసనతో నరకయాతన అనుభవిస్తున్నారు. డ్రెయినేజీ నీరు నిలిచిన గుంతల్లో పందులు, దోమలు స్వైర విహారం చేస్తుండగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.


శివునిపల్లి పాలకుర్తి రోడ్డులో అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రెయినేజీ


జనావాసాల్లో నిలిచిన మురుగునీరు


ఇష్టారాజ్యంగా నిర్మించిన కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టులు

పాలకుర్తి రోడ్డుకు ఇరువైపులా నిర్మాణం చేసిన సైడ్ డ్రెయినేజీలపై అంతర్గత కాలనీలకు వెళ్లే సీసీ రోడ్లకు అనుసంధానం చేసేలా నిర్మాణం చేసిన కల్వర్టులు ప్రమాదకరంగా ఎత్తుగా వేశారు. దాంతో ఆయా కాలనీలకు కనీసం కాలినడకన కూడా వెళ్ల లేని దుస్థితి నెలకొంది. ఇష్టారాజ్యంగా డ్రెయినేజీలపై ఎత్తుగా కల్వర్టులు వేశారని, వాటి పక్కకు మొరం పోయించి అంతర్గత రోడ్లకు అనుసంధానం చేస్తూ సీసీ పోయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రాత్రి వేళల్లో అటుగా వెళ్లేవారు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రెయినేజీల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం..


రైల్వేస్టేషన్ నుంచి పాలకుర్తి రోడ్డుకు సైడ్ డ్రెయినేజీల నిర్మాణం అసంపూర్తిగా ఉండగా మురుగునీరంతా ఇళ్ల ముందు నిలుస్తుంది. దాంతో భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

\- సుధగాని నర్సింగం

అధికారులు వెంటనే స్పందించాలి


శివునిపల్లి నుంచి పాలకుర్తికి వెళ్లే ప్రధాన రోడ్డు వెంట సైడ్ డ్రెయినేజీల సౌకర్యం లేకపోవడం సిగ్గుచేటు. మోరీలు లేకపోవడంతో జనవాసాలు మురుగునీటి కుంటలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు సానుకూలంగా స్పందించాలి.

\- కొలనుపాక శరత్‌కుమార్

గ్రామసభలో పలుమార్లు చర్చించాం..


పాలకుర్తి రోడ్డులో సైడ్ డ్రెయినేజీల సమస్యపై గ్రామ సభలో పలుమార్లు చర్చించాం. ఎన్నిసార్లు చెప్పినా ఆర్అండ్‌బీ అధికారులకు పట్టడం లేదు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలి.

\- బూర్ల విష్ణు

క్లుప్తంగా

క్రీడాకారులకు టీషర్టుల బహూకరణ



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని కబడ్డీ క్రీడాకారులకు స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, స్థానిక యువ నాయకుడు నీలం యువరాజ్ ఆదివారం టీషర్టులను బహూకరించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆయన 14 మంది క్రీడాకారులకు టీషర్టులు బహూకరించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీషర్టులు అందజేసిన యువరాజును క్రీడాకారులు అభినందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ప్రశాంత్, చిన్నరామ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులకు చెందిన పలువురు బీఆర్ఎస్ యూత్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు నేలపోగుల ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య తెలిపారు. బీఆర్ఎస్ యూత్ మండల మాజీ అధ్యక్షుడు గైని ప్రవీణ్‌తో పాటు అబ్బయ్య, విజయ్, ఆంజనేయులు, కృష్ణ, ప్రభాకర్, కుమార్, ఉప్పలయ్య, భాస్కర్, ప్రసాద్, నవీన్, శ్రీకాంత్, దయాకర్, అరుణ్, అఖిల్, సుమంత్ తదితరులు ఉన్నారని ఎంపీటీసీ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, శ్రీనివాసు, ప్రదీప్, ప్రవీణ్ ఉన్నారు.

చేయూత



బచ్చన్నపేట : మండలకేంద్రానికి చెందిన దాచేపల్లి శ్రీనివాస్ (38) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న సహాయ నిధి నుంచి రూ. 40 వేల విలువ చేసే రెండు ఎఫ్‌డీ బాండ్లను మృతుడి కూతుళ్లకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మదూరి వెంకటేష్, నీల కుమారస్వామి, బొమ్మెన శ్రీనివాస్, కుడిక్యాల సతీష్, గొట్టె కరుణాకర్, కొత్త శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో..

జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచకు చెందిన నారదాసు చంద్రశేఖర్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, ఆదివారం స్నేహితులు రూ. 25వేల డీడీని, రూ.1,000 నగదు, బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు.

నివాళి



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, జీడికల్ దేవస్థాన మాజీ డైరెక్టర్ కారంపురి శ్రీనివాస్ మృతదేహానికి ఆదివారం ఎమ్మెల్యే రాజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాగేందర్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు చిట్ల భూపాల్‌రెడ్డి, వంగ నాగరాజు, శ్రీనివాసురెడ్డి, విజయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, మధు, సోమయ్య తదితరులు శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పాలకుర్తి టౌన్: తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని కొండాపురం, దర్దపల్లి గ్రామాల ఆత్మీయ సమ్మేళనంపై కొండపులో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ఇన్‌చార్జ్ కమ్మగాని రమేష్, మల్లునాయక్, గడ్డం కిరణ్, సోమన్న, ఎంపీటీసీ లలిత దేవేందర్, వార్డ సభ్యులు కత్తుల ఎల్లన్న, శివ, పోషాలు, రామచంద్రు,లకావత్ సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

విరాళం అందజేత



తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్‌లోని హనుమాన్ దేవాలయం అభివృద్ధికి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఆలయం గర్భగుడిలో టైల్స్ ఏర్పాటుకు రూ.20 వేల నగదును బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బట్టు సురేందర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి సాయం చేసినందుకు ఆలయ అభివృద్ధి కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఇటీవల మృతి చెందిన కె.అంజయ్య కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ పర్ష రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, మహేష్, బాల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, గణేష్, రాజు, సందీప్, శివ, పూర్ణచందర్, చందు, నర్సింహులు, ఉదయ్, బాబు తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లు సామాజికంగా ఎదగాలి

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా ముదిరాజ్‌లు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి అన్నారు. ఆదివారం మండలంలోని ఎద్దుగూడెంలో ముదిరాజ్ నాయకులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారని చాలీచాలని జీవితాలను వెల్లదీస్తున్నారని అన్నారు. నీల రమేష్, ఎద్దు హరీష్, ప్రభాకర్, నాగయ్య, యాదగిరి, రామలింగం, వెంకటేష్, సత్యకుమార్, సాయిబాబ, వానేష్, మహేందర్, పాండు, సతీష్, సంపత్, శ్రీశైలం, కృష్ణకాంత్, కిరణ్, కళ్యాణ్, మహేష్, శివ పాల్గొన్నారు.


కల్నల్ భిక్షపతిని సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

చలివేంద్రం ఏర్పాటు

రఘునాథపల్లి: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్, లయన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు మర్కాల యాదిరెడ్డిలు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆక్సిజన్ మెడికల్ షాపులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఫ్రీజర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. పూర్వ జోన్ చైర్మన్ గంధ్ర శ్రీకాంత్, పూర్వ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ్, శంకర్‌లింగం, శంకరయ్య, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్, నవీన్, అశోక్, రాజేందర్, సోమేశ్వర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్

ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం

దేవరుప్పుల: ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం ఏర్పడుతుందని సామాజిక యువకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్మించతలపెట్టిన శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయ గోపుర నిర్మాణానికి రూ. 2.50 లక్షల విరాళాన్ని ఆయన అందజేసి మాట్లాడారు. దేశ సంస్కృతీసంప్రదాయాల్లో దేవాలయాల నిర్మాణ పాత్ర ప్రముఖమైందనీ, తెలంగాణను పాలించినటువంటి కాకతీయులు వేయిస్తంభాల గుడి, చారిత్రక రామప్ప వంటి ఆలయాల నిర్మాణాల స్ఫూర్తితో తాను ఆలయ నిర్మాణాలకు తోడ్పాటు అందిస్తున్నానని పేర్కొన్నారు. స్వగ్రామాన్ని విస్మరిస్తున్న రోజుల్లో దేవరుప్పులలో కాటమాయిన గుడికి తోడ్పాటు అందించడం పట్ల గౌడ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, పాలకుర్తి దేవస్థాన కమిటీ డైరెక్టర్ తీగల సత్తయ్య, జిల్లా గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ కారుపోతుల భిక్షపతి, సామాజిక కార్యకర్తలు కారుపోతుల శ్రీనివాస్, బబ్బూరి నాగరాజు, గౌడ సంఘం నాయకులు ఆకుల మల్లయ్య, వెంకటయ్య, కారుపోతుల యాదగిరి, గొడిశాల మల్లేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


గౌడ సంఘం సభ్యులతో శ్రీకాంత్ గౌడ్

‘నిధులపై చర్చకు సిద్ధం’

చిల్పూరు: సహ ఎంపీటీసీల తీర్మానం లేకుండా ఇష్టానుసారంగా ఎంపీపీ రూ.20 లక్షలు ఖర్చు చేసిన విషయం తాము నిరూపించడానికి చర్చకు సిద్ధమేనని అవిశ్వాస ఎంపీటీసీలు అన్నారు. అయితే చర్చ ఎంపీడీఓ కార్యాలయంలో కాకుండా చిల్పూరుగుట్ట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణ వేదికకు ఎంపీపీ సోమవారం రావాలని వారు చెప్పారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం అవిశ్వాస ఎంపీటీసీలు 9 మంది శనివారం ఎంపీపీ సరిత విసిరిన సవాల్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కంకటి రవీందర్ మాట్లాడుతూ ఎంపీటీసీల వెనుక బడా నాయకుడు ఉన్నాడని ఎంపీపీ వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. నాలుగేళ్ల నుంచి ఏ ఒక్కరోజూ ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించక పోవడం, వచ్చిన నిధులు, చేస్తున్న ఖర్చులు తమకు తెలుపకుండా ఇష్టా రీతిగా వ్యవహరించడం వల్లే విసుగు చెంది 9 మంది ఎంపీటీసీలం అవిశ్వాసానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. నిజాలు నిగ్గు తేల్చుకుంటే వెంటనే ఎంపీపీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ భూక్య సరిత, భూక్య యాదగిరి, తాళ్లపల్లి ఉమ, సాదం నర్సింహులు, మారబోయిన అయిలమ్మ, ఈడి ఝాన్సి, మారేపల్లి లలితదేవి, ఎన్న కూస కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు

తిరుపతయ్య ఆశయాలను కొనసాగిస్తాం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు అక్కినపెల్లి(చాకలి)తిరుపతయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో తిరుపతయ్య మృతిచెందగా ఆదివారం ఆయన సంస్మరణ సభను గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మునిగెల రమేష్ తదితరులు తిరుపతయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పనిచేసిన అక్కినపెల్లి తిరుపతయ్య ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొడెపాక యాకయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు, సిద్దుల సుదర్శన్, చిలుముల భాస్కర్, ఉమ్మగోని రాజు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రమేష్ తదితరులు

ఇసుక అక్రమ రవాణాను నిలువరించాలి

దేవరుప్పుల: అభివృద్ధి పనుల పేరిట ఇసుక అక్రమ రవాణాను చేపట్టే దందాను అధికార యంత్రాగం నిలువరించాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకుడు గోల గంగారావు డిమాండ్ చేశారు. కోలుకొండ నుంచి గొల్లపల్లి వరకూ వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక నిల్వల వల్ల భూగర్భ జలాలు పెరిగి రెండు సీజన్లలో వ్యవసాయ సాగుకు నీటికి కొదవలేని పరిస్థితులు కనుమరుగయ్యే ప్రమాదాలు నెలకొన్నాయన్నారు. వాగులో చెక్‌డ్యామ్‌లు కట్టడం వల్ల మరింత రైతులకు లాభాలు జరుగుతాయనుకుంటే అభివృద్ధి పనుల పేరిట ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే ఇసుక దందాను అరికట్టాలని పునరుద్ఘాటించారు.

నియామకం

జనగామ రూరల్: బహుజన సమాజ్ పార్టీ జనగామ మండల అధ్యక్షుడిగా మామిడి సుధాకర్‌ను ఎన్నికైనట్లు జిల్లా ఇన్‌చార్జ్ సీర్మాల రత్నం తెలిపారు. ఆదివారం నియోజక ఇన్‌చార్జ్ జేరుపోతుల కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు నియామక పత్రం అందజేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు నాగులపల్లి అశోక్, స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ ఇరుగు మహేందర్, జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



జనగామ రూరల్: మండలంలోని వెంకిర్యాలలో దుర్గమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య, ఎంపీటీసీ కొమ్ము రాజుల సాలమ్మ, అధ్యక్షుడుగా కీర్తి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా నవీన్, సత్తిరెడ్డి, స్వామి, కోశాధికారిగా శివరాములు ఎన్నికయ్యారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జనగామ రూరల్: పట్టణంలోని సేయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఆదివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసుకొని 1వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు స్నాతకోత్సవ దుస్తులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్. మరియా జోసఫ్, ఫాదర్ మారంరెడ్డి, అల్లం మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముస్తాబు


పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శివకుమార్

రఘునాథపల్లి: మండల కేంద్రంలో మే 2 నుంచి 11వ తేదీ వరకు శ్రీ ముత్యాలమ్మ, శ్రీ ఎల్లమ్మ, శ్రీ పోచమ్మ, శ్రీ మైసమ్మ, శ్రీ విజయదుర్గామాత దేవతల ప్రతిష్ఠాపనకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆదివారం సర్పంచ్ పోకల శివకుమార్ ఉత్సవాల కమిటీ చైర్మన్ పోరెడ్డి రాఘవరెడ్డితో నూతన ఆలయాలకు రంగులు అద్దే పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా అత్యంత వైభవంగా 10 రోజుల పాటు నిర్వహించే దేవతల ఉత్సవాల వివరాలు వారు వెల్లడించారు. ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తరిగొప్పుల: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సెంకడరీ పాఠశాలలో 1988–89 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం విశ్రాంత ఉపాధ్యాయుడు యాదగిరిరావు ఆధ్వక్షతన ఆదివారం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులందరూ కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉప్పల మల్లన్న జాతర

- శివనామస్మరణతో శివపార్వతుల కల్యాణోత్సవం
- ఊరు నామకరణానికి ప్రతీకగా జాతర నిర్వహణ

దేవరుప్పుల: ఊరు నామకరణానికి ప్రతీకగా ఏటా జరిగే ఉప్పల మల్లన్న జాతర పురస్కరించుకొని రేపటి నుంచి మండల కేంద్రంలో శివనామస్మరణంతో శివపార్వతుల కల్యాణోత్సవం జరుగనుంది. వివరాళ్లోకెళ్తే...పూర్వం మండల కేంద్రానికి ఉప్పు వ్యాపారీ బస్తాలను వాగులో నుంచి ఎడ్లబండిపై తీసుకవస్తుండగా మార్గమధ్యలోనే దిగబడింది. దీంతో బస్తాలు కిందికి దింపే క్రమంలో శివలింగం(దేవర) ఉప్పులో దొరికింది. దీంతో ఆ గ్రామానికి వేద బ్రాహ్మణులు దేవరుప్పుల (దేవర+ఉప్పుల)గా నామకరణం చేసి శివాలయాన్ని స్థాపించారు. ఆనాటి నుంచి ఏటా శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలతో మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఈ జాతర నాటికి పంటల దిగుమతి క్రమంలో రైతులు ఆనందోత్సాహాలతో ఉండే క్రమంలో ఇంటింటా ఆడపడుచులను పిలిపించుకొని కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటారు. దేవరుప్పుల ఉమ్మడి గ్రామంలో ఒకప్పుడు ఉండే కామారెడ్డిగూడెం ప్రజలు సైతం పెద్దఎత్తున జాతరలో పాల్గొంటారు. ఈ పురాతన ఆలయానికి దేవదాయ,రోడ్లు భవనాల శాఖల మాజీ మంత్రివర్యులు నెమరుగొమ్ముల యతిరాజారావు హయాంలో జాతర విశిష్టత కోసం ఆలయ గోపురం మరమ్మతులు చేపట్టగా ప్రస్తుత పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హయాంలో జాతర నిర్వహణ, భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు.

రేపు శివపార్వతుల కల్యాణోత్సవం

మండల కేంద్రంలో ప్రారంభమయ్యే ఉప్పల మల్లన్న జాతర సందర్భంగా మంగళవారం రాత్రి 8 గంటలకు శివపార్వతులు (శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి) కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ పూజారి పెద్దాపురం వెంకటేశ్వరశర్మ తెలిపారు. బుధవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.


భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం


శివలింగం

వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలి


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాజు

జఫర్‌గఢ్: గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు కోరారు. మండలంలోని తమ్మడపల్లి (జి)లో నూతనంగా ఏర్పాటు చేసిన నాసర్ ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షితమైన నీరు అందుతుందన్నారు. ఈ నీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎంపీటీసీ సభ్యులు చిలువేరు శివయ్య, బీజేపీ జిల్లా నాయకులు ఎండి వలిపాష, సీపీఐ మండల నాయకులు ఎండి యాకుబ్‌పాష, రాపర్తి రాజ్‌కుమార్, చిలువేరు ప్రభాకర్, మహిపాష పాల్గొన్నారు.